సీఎం పర్యటనకు సర్వం సిద్ధం

- పరిశీలించిన మంత్రులు, ఎమ్మెల్యేలు
- నేడు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయనున్న సీఎం
- గండికోటలో అభివృద్ధి పనులు ప్రారంభం



గూడెంచెరువులో చంద్రబాబు పర్యటనకోసం ఏర్పాటైన ప్రజావేదిక



చంద్రబాబు పర్యటనకోసం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

జమ్మలమడుగు, జూలై 31(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం జమ్మలమడుగులో పర్యటించనున్నారు. దీనికి సంబంధించి ఏర్పాట్లన్నీ పూర్తి చేశామని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ గూడెంచెరువు గ్రామానికి వెళ్లి పెన్షనర్ల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి జీవన స్థితిగతులు తెలుసుకున్నారు. ఈ గ్రామం లో టిడ్కో కాలనీ ఎదురుగా సీఎం పాల్గొనే ప్రజావేదికను పరిశీలించారు. అక్కడ సెక్యూరిటీ నిర్వహణపై అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను పరిశీలించారు. ఇన్‌చార్జి మంత్రి సవిత, ఎస్పీ అశోక్‌కుమార్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో కడప, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేలు ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, చిన్నయ్య పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఇలా..

జమ్మలమడుగుకు శుక్రవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేరుకోనున్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పక్కన ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు 12.30 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి గూడెంచెరువుకు వాహనంలో వెళతారు. రాజీవ్‌నగర్ కాలనీ, మోరగుడి చేనేత కాలనీ, ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో పింఛన్ల పంపిణీతో పాటు బంగారు కుటుంబాలకు సంబంధించి అక్కడే మాట్లాడతారు. మొదట ఉలసాల అలివేలమ్మకు వితంతు పింఛన్, అక్కడే 224 నంబరుగల ఇంటి యజమాని వద్ది నారాయణస్వామి, కుండా వెంకటనారాయణ తదితరులకు పింఛన్లు పంపిణీ చేస్తారు. అక్కడి నుంచి టిడ్కో గృహాలకు వెనుకభాగంలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక వద్దకు సీఎం వెళతారు. అక్కడ దాదాపు 141 మంది బంగారు కుటుంబాలకు సంబంధించిన ప్రజలతో మాట్లాడతారు. ప్రజావేదిక వద్దకు మధ్యాహ్నం 12.50 గంటలకు చేరుకుని రెండు గంటల వరకు అక్కడే సమావేశంలో ఉంటారు. 2.35 గంటల నుంచి 3.35 గంటల వరకు నానుబాల యల్లప్ప ఫంక్షన్ హాలులో టీడీపీ నాయకులతో సమావేశం అవుతారు. అక్కడి నుంచి గండికోట చేరుకుని సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు అక్కడే పరిశీలిస్తారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అధికారులతో భేటీ అవుతారు.

భారీ బందోబస్తు

జమ్మలమడుగులో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన నేపథ్యంలో పోలీసు అధికారులు భారీ బందోబసత్తు ఏర్పాటు చేశారు. దాదాపు రెండు వేల మంది పోలీసులను నియమించారు. అడిషనల్ ఎస్పీ ఒకరు, డీఎస్పీలు 16 మంది, సీఐలు 65 మంది, ఎస్ఐలు 131 మంది, హెడ్‌కానిస్టేబుళ్లు 359 మంది, కానిస్టేబుళ్లు 625 మంది, ఉమెన్ పోలీసులు 84 మంది, హోంగార్డులు 383 మంది, ఇతర ఏఆర్ కానిస్టేబుళ్లు తదితరులంతా కలిసి రెండు వేల మంది బందోబస్తు నిర్వహించనున్నారు.



ఆశలన్నీ బాబుపైనే

- ప్రపంచ పర్యాటక కేంద్రంగా గండికోట అభివృద్ధి జరిగేనా?
- మూడేళ్లలో స్టీలు ప్లాంటు నిర్మాణం పూర్తయ్యేనా?
- సాగునీటి ప్రాజెక్టుల కోసం ప్రజల ఎదురుచూపులు
- కొప్పర్తిలో పరిశ్రమలకు పర్యావరణ అనుమతుల అడ్డంకి
- మహానాడు హామీలు అమలు చేయాలి
- నేడు సీఎం చంద్రబాబు రాక



ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న సొంత జిల్లావాసి వైఎస్ జగన్ పులివెందులను తప్ప దేనినీ పట్టించుకోలేదు. దీంతో వైసీపీ హయాంలో జిల్లా అభివృద్ధి పడకేసింది. కడప నగర శివారులో మే నెలలో నిర్వహించిన మహానాడు వేదికగా సీఎం చంద్రబాబు జిల్లా అభివృద్ధిపై వరాలజల్లు కురిపించారు. జీఎన్ఎస్ఎస్ ప్రాజక్టుకు రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తున్నట్లు హామీఇచ్చారు. కడపలో తాగునీరు, డ్రైన్స్, చెరువుల అభివృద్ధికి హామీ ఇచ్చారు. స్టీలు ప్లాంట్‌ను నిర్మించి తాము అధికారంలో ఉండగానే ప్రారంభిస్తామన్నారు. గండికోటను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. నేడు సీఎం గండికోటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనుండటంతో జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన హామీలను కూడా అమలు చేయాలని కోరుతున్నారు.

వివరాలు 6 లో

అవుకు నుంచి గండికోటకు కృష్ణాజలాలు విడుదల



అవుకు రిజర్వాయర్ వద్ద పూజలు చేస్తున్న జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

కొండాపురం / జమ్మలమడుగు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా అవుకు రిజర్వాయర్ నుంచి గండికోట ప్రాజెక్టుకు గురువారం ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కృష్ణాజలాలను విడుదల చేశారు. అవుకు రిజర్వాయర్ వద్ద ఎమ్మెల్యే పూజలు నిర్వహించి జలవనరులశాఖ అధికారులతో కలిసి ఆయన నాలుగు గేట్లు ఎత్తి గండికోటకు 2,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గోరకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు రిజర్వాయర్‌కు గురువారం మధ్యాహ్నం 2500 క్యూసెక్కుల నీరు వస్తోందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. అది శుక్రవారం నాటికి 20,000 క్యూసెక్కుల వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. గోరుకల్లు నుంచి అవుకు రిజర్వాయర్‌కు వచ్చే నీటిని యథాతథంగా గండికోట ప్రాజెక్టుకు మళ్లించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నీరు జీఎన్ఎస్ఎస్ మెయిన్‌కెనాల్ ద్వారా 53 కిలోమీటర్లు ప్రయాణించి సొరంగం ద్వారా గండికోట ప్రాజెక్టులోకి శుక్రవారం చేరుతుందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. గండికోట ప్రాజెక్టులో గురువారం 11.7 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు.

1300 టన్నుల ఎరువులు రాక



ఎరువులను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రానాయక్

కడప రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ వ్యవసాయ అవసరాలకు గాను కడప, అన్నమయ్య జిల్లాలకు సంబంధించి గురువారం కడప రైల్వేస్టేషన్‌కు 1,300 టన్నుల మేర యూరియా, ఎంఎస్ ఎరువులు వచ్చాయి. వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రానాయక్ రైల్వేస్టేషన్ చేరుకుని ఎరువులను పరిశీలించారు. కేటాయించిన మేరకు ఎరువులను ఆయా జిల్లాలకు అక్కడ నుంచి సరఫరా చేశారు. ఇందులో వైఎస్సార్ కడప జిల్లాకు 1025 టన్నులు రాగా వాటిలో 525 టన్నులు ప్రైవేట్ డీలర్లకు, 500 టన్నులు మార్క్‌ఫెడ్‌కు తరలించారు. అలాగే అన్నమయ్య జిల్లాకు 275 టన్నులు రాగా వాటిలో ప్రైవేట్ డీలర్లకు 125 టన్నులు, మార్క్‌ఫెడ్‌కు 150 టన్నులు పంపిణీ చేశారు.

గండికోటను సందర్శించిన పర్యాటక శాఖ మంత్రి

జమ్మలమడుగు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గండికోటను పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ గురువారం సందర్శించారు. ముందుగా ఆయన కోట ప్రాంగణంలోని కత్తుల కోనేరు, అక్కడి నుంచి జుమ్మా మసీదు, ధాన్యాగారం సందర్శించి పరిశీలించారు. అప్పట్లో రాజులు నిర్మించిన రాతికట్టడాలను పరిశీలించారు. అలాగే సహజసిద్ధంగా ఏర్పడిన పెన్నా లోయను చూసి తిలకించారు. అక్కడి నుంచి లోయ పక్కన టెంట్లను, గండికోట పరిసర ప్రాంతాలను చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండికోటలో కట్టడాలు మహా అద్భుతమన్నారు. సహజసిద్ధంగా ఏర్పడిన పెన్నా లోయ పర్యాటకులను ఆకర్షిస్తోందన్నారు.



గండికోటను సందర్శించిన పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్

పర్యావరణ పరిరక్షణ

ప్రతి ఒక్కరి బాధ్యత

జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం



డైట్ కేంద్రంలో మొక్క నాటుతున్న డీఈవో అధ్యాపకులు

రాయచోటి టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుని బాధ్యతని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ కే. సుబ్రమణ్యం అన్నారు. గురువారం ఉదయం డైట్ మైదానంలో 175 మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం పెరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో మొక్కల పెంపకం అత్యవసరమని, దాని కోసం ప్రతి విద్యార్థి ఒక మొక్కను పెంచాల్సిన బాధ్యత ఉందన్నారు. భూతాపం తగ్గించడానికి ప్రపంచ వ్యాప్తంగా మొక్కలు పెంచాలన్నారు. ప్రాథమిక బాధ్యతలో భాగంగా మొక్కలకు కొంచెం స్థలం వదిలివేసి ఇంటి నిర్మాణం చేసుకోవాలని సూచించారు. రోడ్ల వెంబడి, పాఠశాలల్లో, బంజరు భూముల్లో మొక్కలను విరివిగా నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాబోయే తరాల ఆశలను, ఆకాంక్షలను, అవసరాలను తీర్చాలంటే మనం మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. శిలాజ ఇంధనాల వాడకం తగ్గించి, వాటి స్థానంలో సౌరశక్తి బయోగ్యాస్ లాంటి ఇంధనాలను వాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డైట్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి, అధ్యాపకులు ఉషామాధురి, గిరిబాబుయాదవ్, శ్రీనివాసులు, మోహన్‌నాయక్, కలీముల్లా, శివప్రసాద్, ఛాత్రోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలపై పోలీసులకు ఫిర్యాదు

నిమ్మనపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఫేక్ ఐడీతో గుంపుగా వెళ్లి కస్తూర్బాగాంధీ హాస్టల్‌లో తనిఖీ చేసిన వైసీపీ నేతలపై గురువారం పాఠశాల చైర్మన్ శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 28వ తేదీ సోమవారం మధ్యాహ్నం సర్పంచ్ చెంద్రాయుడు, వైస్ ఎంపీపీ జయప్రకాష్‌తో కలిసి దాదాపు 8 మంది వైసీపీ, నేతలు ఎలాంటి అనుమతులు లేకుండా బాలికల హాస్టల్‌ను తనిఖీ చేశారన్నారు. అంతేకాక మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించినట్లు తెలిపారు. దీనిపై హాస్టల్ ఉపాధ్యాయులు ఎవరని అడగగా తాము వైసీపీ రాష్ట్ర విద్యార్థి సెక్రటరీ అని తమను హాస్టళ్ల తనిఖీ చేపట్టమని జగన్ తెలపడంతో వచ్చామని చెప్పడంతో వారు అభ్యంతరం చెప్పలేదని తెలిపారు. అనంతరం వైసీపీ నేతలు సోషల్ మీడియాలో హాస్టల్ తనిఖీపై పోస్టులు పెట్టారని తెలిపారు. దీనిపై అనుమతుల లేనిదే బయటి వ్యక్తులు హాస్టల్ వద్దకు రాకుండా రక్షణ కల్పించి వారిపై చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో కోరారు.

వివాదాస్పద భూమిలో సర్వే



సర్వే సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

కురబలకోట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అంగళ్లు సమీపంలోని మిట్స్ యూనివర్సిటీ పక్కన ఉన్న విలువైన వివాదాస్పద భూమిలో రెవెన్యూ అధికారులు గురువారం సర్వే చేశారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న సర్వేనెంబర్-220లో 69.42 ఎకరాల భూమి ఉంది. ఈ భూమికి సంబంధించి కొన్నేళ్లుగా వివాదం నడుస్తోంది. ఈ భూమిని కొందరు ఆక్రమించుకోవడానికి ప్రయత్నించారు. దీంతో అప్పట్లో ఆ భూమిలోకి ఎవరూ వెళ్లకుండా పోలీసులు 145 సెక్షన్‌ను అమలు చేశారు. అనంతరం కొన్నేళ్ల పాటు ఈ భూమిలోకి ఎవరూ వెళ్లలేదు. అయితే వైసీపీ ప్రభుత్వంలో 145 సెక్షన్‌ను రద్దు చేయడంతో ఈ భూమిని ఆక్రమించుకోవడానికి పులివెందుల వాసులు ప్రయత్నించారు. దీంతో అప్పట్లో వివాదం నెలకొంది. అయితే ప్రభుత్వం మారడంతో వివాదం మళ్లీ మొదటకొచ్చింది. ఈ నేపథ్యంలో గత ఏడాది తిరుపతి, అనంతపురానికి చెందిన పలువురు భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నించగా భూహక్కుదారులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో తిరుపతికి చెందిన చల్లా వెంకటేశ్వరు 3.15 సెంట్ల భూమికి హద్దులు చూపాలని దరఖాస్తు చేసుకోడంతో తహసీల్దార్ ధనంజయులు, సర్వేయర్ భువనేశ్వరి ఆ సర్వే నెంబర్ భూహక్కుదారులకు నోటీసులు అందజేసి సర్వే చేశారు. కాగా సీఐ సత్యనారాయణ, ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ భారీ బందోబస్తును నిర్వహించారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న

ఎంఈవోలపై చర్యలు తీసుకోండి

డీఈవో కార్యాలయం ఎదుట విద్యార్థి సంఘాల ధర్నా



డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కిచెన్ గార్డెన్ల నిర్వహణలో విధులు సక్రమంగా నిర్వహించని ఎంఈవోలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృత్‌తేజ్, ఏపీఎస్ జేఏసీ రాయలసీమ జిల్లాల కన్వీనర్ ఉత్తన్న డిమాండ్ చేశారు. గురువారం డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేయడంతో పాటు, ఏడీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది కిచెన్ గార్డెన్ల కోసం ప్రభుత్వం జిల్లాలో ఉన్న కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి, ఒక్కొక్క పాఠశాలకు రూ.5 వేలు మంజూరు చేసిందన్నారు. మంజూరు చేసిన నిధులను జిల్లా విద్యాశాఖ అధికారి మార్చి, ఏప్రిల్ నెలల్లో మండల విద్యాశాఖ అధికారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినా, ఆ నిధులను సంబంధిత వినియోగంలో మండల విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వహించారన్నారు. ముఖ్యంగా మదనపల్లె డివిజన్ పరిధిలోని కొన్ని పాఠశాలలు మాత్రమే నామమాత్రంగా సొంత నిధులతో గార్డెన్‌ను ఏర్పాటు చేసుకున్నాయన్నారు. నిధులు జమ చేసిన పాఠశాలల్లో వాటిని ఏమాత్రం ఉపయోగించకుండానే ఉపయోగించినట్లుగా డీఈవోకు యుటిలైజేషన్ సర్టిఫికెట్లను ఇచ్చారన్నారు. ఎంఈవోలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భగ్గుమన్న బొప్పాయి రైతు



రైల్వేకోడూరు ప్రధాన దారిలో వరి గడ్డిని కాల్చిన రైతులు

- ప్రధాన దారిలో వరిగడ్డి కాల్చి లారీల అడ్డగింత
- స్తంభించిన వాహనాల రాకపోకలు
- దళారుల ఇళ్లను ముట్టడించిన రైతులు
- రైతులపై పోలీసుల దురుసు ప్రవర్తన

రైల్వేకోడూరు/రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బొప్పాయి ధరలను ఉన్నపళంగా తగ్గించడంతో గురువారం తెల్లవారుజామున రైల్వేకోడూరు ప్రధాన దారిలో వరిగడ్డిని కాల్చి బొప్పాయి లారీలను రైతులు అడ్డుకుని ప్రధాన దారిలో ఆందోళన చేశారు. దళారుల ఇళ్లను ముట్టడించారు. సమాచారం తెలుసుకున్న రైల్వేకోడూరు సీఐ కె.హేమసుందరరావు, రూరల్ సీఐ పసుపుల వెంకటేశ్వర్లు, ఓబులవారిపల్లె, కోడూరు ఎస్‌ఐలు మహేశ్, వీఎల్ లక్ష్మీప్రసాద్‌రెడ్డిలు తమ సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలం వద్దకు చేరుకుని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో మంటలను ఆర్పివేశారు. ఆగ్రహించిన రైతులతో పోలీసులు చర్చలు జరిపారు. ఉన్నపళంగా దళారులు బొప్పాయి టన్ను రూ.7 వేలు తగ్గించారని, వరుసగా ధరలను తగ్గించుకుంటూ పోతున్నారని రైతులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులతో ఒకవైపు చర్చలు జరుగుతుండగానే చాలామంది రైతులు దళారుల ఇళ్ల వద్ద మళ్లీ ఆందోళన చేశారు. బొప్పాయి ధరలు పెంచినంత వరకు కాయలు కోసేది లేదని, లారీలను తోటల్లోకి రానివ్వమని తెగేసి చెప్పారు. అయ్యప్పస్వామి దేవాలయం నుంచి వెంకటేశ్వరస్వామి దేవాలయం వరకు ప్రధానదారి పొడవునా రైతులు భారీ ఎత్తున నినాదాలు చేశారు. చిట్వేలి రోడ్డులో గడ్డి కాల్చుతున్న ఓ రైతును పోలీసులు కొట్టారని, అలాగే సీఐ హేమసుందరరావు భూమా శివకేశవరెడ్డి అనే రైతుపై దురుసుగా ప్రవర్తించారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు రైతులకు అండగా ఉండాలనేగాని చేయి చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. సీఐ మాట్లాడుతూ కావాలనే రైతులపై చేయి చేసుకోలేదని, రైతులు ఎక్కడ లా అండ్ ఆర్డర్‌కు భంగం కలిగిస్తారోనని కట్టడి చేయడానికి మాత్రమే చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని వివరించారు. దళారులు మోసాలు చేసి రైతులను నిలువునా నాశనం చేస్తున్నారని సబ్ కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని రైతులు ఆరోపించారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి బొప్పాయి సాగు చేస్తే దళారుల మాటలు విన్న మార్వాడీలు ధరలు తగ్గిస్తున్నారని రైతులు మండిపడ్డారు.

బొప్పాయికి ధరలు బాగా ఉన్నా రైల్వేకోడూరులో మాత్రం ధరలు తగ్గించి మోసం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు రైతులను నచ్చచెప్పి రెవెన్యూ కార్యాలయం వద్దకు రావాలని చెప్పడంతో అక్కడికి వెళ్లారు. అక్కడ ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే రైతులతో మాట్లాడుతూ మీకు సమస్యలు ఉంటే అధికారులతో మాట్లాడి పరిష్కరించుకోవాలే కానీ ఇలా రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేయవద్దని, ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని తెలిపారు. టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి విషయం తెలుసుకుని కోడూరు రెవెన్యూ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బొప్పాయి రైతులకు అండగా ఉంటామని, ధరల పెరుగుదలకు కృషి చేస్తామన్నారు. సమావేశం లోనే కలెక్టర్ చామకూరి శ్రీధర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. కలెక్టర్ స్పందించి శుక్రవారం సాయంత్రం 4 గంటలకు కోడూరుకు వచ్చి రైతులతో సమావేశం ఏర్పాటు చేసి పరిష్కారం చేస్తామని తెలిపారు. దీంతో రైతులు శాంతించారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారిణి సుభాషిణి, మార్కెటింగ్ ఏడీ త్యాగరాజు, రైల్వేకోడూరు తహసీల్దార్ కొనేటి అమర్‌నాథ్, ఉద్యానశాఖ అధికారి భాస్కర్, డిప్యూటీ ఎన్నికల తహసీల్దార్ గల్లా రమణలు రైతుల సమస్యలపై నివేదిక సిద్ధం చేశారు. అయితే బొప్పాయి రైతుల ఆందోళన సందర్భంగా కొందరు వ్యక్తులు సందట్లో సడేమియా అంటూ మార్వాడీ ఇంటిలోకి ప్రవేశించి రూ.70 వేలు దోచుకున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే సీసీ కెమెరాలను కూడా ధ్వంసం చేసినట్లు తెలిపారు. కొందరు మార్వాడీలు, దళారులపై పలువురు దాడికి దిగినట్లు తెలిపారు.



రైల్వేకోడూరు ప్రధాన దారిలో ఆందోళన చేస్తున్న బొప్పాయి రైతులు



రైతును చేత్తో నెట్టివేస్తున్న సీఐ హేమసుందరరావు



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ముక్కా రూపానందరెడ్డి

ఉపాధి బిల్లుల బకాయి రూ. 2.14 కోట్లు

- 217 ఎకరాలతో ఉద్యాన పంటల సాగు
- 100 ఎకరాల్లో గడ్డి పెంపకం



పీలేరు రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలు చేసిన పనులకు పీలేరు మండలంలో రూ.2.14 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది. రెండు నెలలుగా డబ్బులు కూలీల ఖాతాల్లో జమ కాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ ఏడాది జూన్ నుంచి ఉపాధి బిల్లుల చెల్లింపు పెండింగ్‌లో ఉంది. ఉన్న బకాయిలలో కూలీలకు రూ.1,32,68,593 చెల్లించాల్సి ఉంది. అలాగే సీసీ రోడ్లు, గోకులాల నిర్మాణంలో మెటీరియల్ కోసం రూ. 81,67,814 పెండింగ్ బిల్లులు మంజూరు కావాల్సి ఉంది. మెటీరియల్ బిల్లులు గత ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉండడంతో పనులు చేసిన వారు బిల్లులు ఎప్పుడు వస్తాయోనని నిరీక్షిస్తున్నారు. పీలేరు మండలంలో ప్రస్తుతం 217 ఎకరాలలో ఉద్యాన పంటల సాగు, 100 ఎకరాల్లో గడ్డి పెంపకం, పలు పంచాయతీల్లో సప్లయ్ ఛానళ్ల మరమ్మతులు, పూడికతీత పనులు మాత్రమే జరుగుతున్నాయి. ఇవే కాకుండా మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా పెద్ద ఎత్తున సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు జరిగాయి.

ప్రతి ఒక్కరికీ పనులు



పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలో పని అడిగిన ప్రతి ఒక్కరికీ స్థానికంగా ఉపాధి పనులు చూపిస్తున్నాము. ఏ ఒక్కరూ స్థానికంగా పనిలేదని అధైర్యపడాల్సిన అవసరం లేదు. ఎంతమంది అయినా స్థానికంగానే ఉపాధి పనులు చేసుకోవచ్చు. చేసిన పనులకు బిల్లులు ఆన్‌లైన్ చేశాము. వచ్చిన వెంటనే కూలీల అకౌంట్లలో జమ అవుతాయి.

అశోక్‌రెడ్డి, ఏపీవో, పీలేరు.

ఏఎస్‌ఐ సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి : ఎస్పీ



ఏఎస్‌ఐ శ్రీనివాసులును సన్మానిస్తున్న ఎస్పీ

రాయచోటిటౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ పొందిన వాల్మీకిపురం పోలీస్‌స్టేషన్ ఏఎస్‌ఐ శ్రీనివాసులు సేవలను పోలీసు యంత్రాంగం ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటుందని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్‌ఐ శ్రీనివాసులుకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఏఎస్‌ఐ శ్రీనివాసులు అంకితభావంతో అహర్నిశలు సేవలందించారని ప్రశంసించారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆరోగ్యంగా, ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. అలాగే అవసరమైనప్పుడు పోలీసుశాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, ఆర్‌ఐ వీజే రామకృష్ణ, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ తులసిరాం, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు పి.రాజారమేశ్, కె.రాజారెడ్డి, ఆర్ఎస్‌ఐ బి.అమర్‌నాథరెడ్డి, ఏఎస్‌ఐ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వృద్ధుడి మృతి

ఒంటిమిట్ట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సమీపంలో ఉన్న ఈద్గా వద్ద ఎ.అర్జున్(66) అనే వృద్ధుడు గురువారం మృతి చెందాడు. ఇతను చిత్తూరు జిల్లా నారాయణవనం మండలం జీఎన్ కండ్రిగకు చెందిన వ్యక్తి. బుధవారం ఉదయం తిరుపతి నుంచి ఇంటర్‌సిటీ రైల్లో వచ్చి ఒంటిమిట్టలో దిగాడు. ఆరోగ్యం సరిగా లేకపోవడంతో స్థానిక పీహెచ్‌సీలో వైద్యం పొంది తిరిగి రైల్వేస్టేషన్‌కు వెళుతూ మార్గమధ్యలోనే ఈద్గా వద్ద మృతి చెందాడు. గురువారం ఉదయం అటుగా వెళుతున్న వ్యక్తులు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి వద్ద ఉన్న సెల్ నెంబరు ఆధారంగా పోలీసులు అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు మృతదేహాన్ని తీసుకెళ్లారు.

వృద్ధురాలి మృతి అనుమానాస్పదం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

రాయచోటి టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని గున్నికుంట్ల రింగురోడ్డు సమీపంలో వండాడి సరోజమ్మ అనే వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు... రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలో నివాసం ఉంటున్న వండాడి చిన్నవెంకటప్ప భార్య సరోజమ్మ (70) మంగళవారం నుంచి కనిపించకుండాపోయింది. దీంతో కుటుంబ సభ్యులు పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు బంధువుల ఇళ్ల వద్ద వెతికారు.

ఈ క్రమంలో గున్నికుంట్ల రింగు రోడ్డు సమీపంలోని గుట్టపైన వృద్ధురాలి మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అర్బన్ ఎస్‌ఐ బాలకృష్ణ సిబ్బందితో వెళ్లి సంఘటనా స్థలానికి చేరుకుని విషయాన్ని తెలియజేయడంతో సరోజమ్మ కుమారుడు వెంకట్రమణ అక్కడికి చేరుకుని తల్లిని గుర్తించాడు. మృతదేహాన్ని రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ వెంకటచలపతి తెలిపారు.

ఆశలన్నీ బాబుపైనే

- ప్రపంచ పర్యాటక కేంద్రంగా గండికోట
- మూడేళ్లలో స్టీలు ప్లాంటు నిర్మాణం
- సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయాలి
- కొప్పర్తిలో పరిశ్రమలకు పర్యావరణ అనుమతుల అడ్డంకి
- మహానాడు హామీలు అమలు చేయాలి

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో జిల్లాలో అటు పర్యాటకం, ఇటు నీటిపారుదల రంగం పడకేశాయి. చంద్రబాబు కడప జిల్లాకు వ్యతిరేకి అంటూ జగన్ అండ్ కో దుష్ప్రచారం చేస్తుంటారు. ఆ ప్రచారాన్ని తిప్పికొట్టే సువర్ణ అవకాశం ఇప్పుడు చంద్రబాబు చేతుల్లో ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం జమ్మలమడుగు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. పింఛన్ల పంపిణీతో పాటు గ్రాండ్‌కెనాన్‌గా గుర్తింపు పొందిన గండికోటలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు.

స్టీలు ఫ్యాక్టరీ

జిల్లావాసుల చిరకాల వాంఛ స్టీలు ఫ్యాక్టరీ నిర్మాణం. ఇప్పటికే ముగ్గురు ముఖ్యమంత్రులు శంకుస్థాపన చేశారు. అయినా అడుగు ముందుకు పడని పరిస్థితి. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తలపెట్టిన బ్రాహ్మణీ స్టీలు ప్లాంటు నిర్మాణం అటకెక్కింది. చంద్రబాబు 2018లో మైలవరం మండలంలో శంకుస్థాపన చేసినా అనంతరం ఆయన అధికారం కోల్పోవడంతో అదీ ఆగిపోయింది. జగన్ అధికారంలోకి వచ్చాక సున్నపురాళ్లపల్లె వద్ద రెండుసార్లు శంకుస్థాపన చేశారే కానీ స్టీలు ప్లాంట్ నిర్మాణం చేపట్టలేదు. ఈ నేపథ్యంలో మహానాడులో చంద్రబాబు చెప్పిన విధంగా సున్నపురాళ్లపల్లె వద్ద స్టీలు ప్లాంటు నిర్మాణం పూర్తి చేసి వెయ్యిమందికి ఉపాధి కల్పించేలా పనులు ముమ్మరం చేయాల్సి ఉంది.

కడపలో తాగునీటి ఎద్దడి

కడప కార్పొరేషన్‌లో వేసవి వచ్చిందంటే చాలు తాగునీటి ఎద్దడి నెలకొంటుంది. అయితే ఈసారి కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పక్కా ప్రణాళికతో సగం డివిజన్లలో రోజూ నీళ్లు ఇచ్చేలా చేశారు. కడపలో శాశ్వతంగా తాగునీటి ఎద్దడి నివారణ కోసం గత టీడీపీ హయాంలోనే రూ.75 కోట్లతో లింగంపల్లె వద్ద సర్ఫేజ్ చెక్‌డ్యాం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. తర్వాత ప్రభుత్వం మారడంతో అది నిలిచిపోయింది. చంద్రబాబు మళ్లీ సీఎం కావడంతో తమకు తాగునీటి ఎద్దడి లేకుండా చేయాలని నగర ప్రజలు కోరుతున్నారు.

రైల్వేలైను

కడప నుంచి దూరంలో ఉన్న చెన్నై, హైదరాబాదు నగరాలకు రైలు ఉంది కానీ దగ్గరలో ఉన్న బెంగళూరుకు లేదు. కడప-బెంగళూరు రైల్వే లైను జిల్లావాసుల చిరకాల వాంఛ. జగన్ హయాంలో ఐదేళ్లూ ఆ ప్రాజెక్టును అటకెక్కించారు.

ఇటీవల కేంద్రం దాదాపు రూ.వెయ్యి కోట్లు మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు పూర్తి చేసి జిల్లా అభివృద్ధిలో చంద్రబాబు మార్కు చూపించాలని ప్రజలు కోరుతున్నారు.

సాగునీటి ప్రాజెక్టులు



జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పురోగతి నత్తనడకన సాగుతోంది. మహానాడు సందర్భంగా జీఎన్ఎస్‌కు రూ.1000 కోట్లు కేటాయిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ ప్రాజెక్టుకు డీపీఆర్ పూర్తి చేసి త్వరగా నిర్మాణం చేపట్టాలి. ఇక జీఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులు సాగడంలేదు. సర్వరాయసాగర్, వామికొండ రిజర్వాయర్లకు సంబంధించి పెండింగు పనులు ఉన్నాయి. బ్రహ్మంసాగర్ లీకేజీ అలాగే ఉంది. వీటిన్నింటినీ యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాల్సి ఉంది.

గండికోట



గండికోటలో సహజ సిద్ధంగా ఏర్పడిన పెన్నాలోయ, ఇక్కడున్న అద్భుతమైన కట్టడాలు గొప్ప వారసత్వ సంపద. గండికోట వైభవం అందరికీ తెలిసేలా 2014-2019లో సీఎం చంద్రాబు నాయుడు ప్రభుత్వం ఇక్కడ ఉత్సవాలు నిర్వహించింది. సొంత జిల్లా వాసి జగన్ సీఎం అయిన తరువాత గండికోట అభివృద్ధిని గాలికి వదిలేశారు. చంద్రబాబు మళ్లీ సీఎం కావడంతో గండికోటకు ప్రాధాన్యం లభిస్తుందని అందరూ ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ రూ.165 కోట్ల విలువైన అభివృద్ధి పనులను శుక్రవారం సీఎం శంకుస్థాపన చేయనున్నారు. అయితే ఈ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

కొప్పర్తి



వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా కొప్పర్తిలో ఓ బ్లాక్‌ను కేంద్రం నిధులతో అభివృద్ధి చేస్తున్నారు. కొప్పర్తి పారిశ్రామికవాడలో ఇప్పటికే కొన్ని పరిశ్రమలున్నాయి. పర్యావరణ అనుమతులు లేకపోవడంతో పరిశ్రమల ఏర్పాటుకు అడ్డంకిగా ఉందని చెబుతున్నారు. కేంద్రంలోనూ ఎన్‌డీఏ సర్కారు ఉండడంతో పర్యావరణ అనుమతులు తెచ్చుకుంటే పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుంది.

ఇక ఆటో మ్యుటేషన్

● రిజిస్ట్రేషన్ అయినరోజే మ్యుటేషన్ పూర్తి

● నేటి నుంచి కార్పొరేషన్ పరిధిలో అమలు

కడప కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఏవైనా స్థిరాస్తులకు రిజిస్ట్రేషన్లు జరిగితే పేర్ల మార్పునకు మ్యుటేషన్ చేసుకోవాలంటే రెవెన్యూ, కార్పొరేషన్, మున్సిపల్ అధికారులను ప్రసన్నం చేసుకోవాల్సిందే. వాళ్ల డిమాండ్ మేరకు సమర్పించుకుంటే సరి. లేదంటే కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరగాల్సిందే. ప్రజలకు ఈ ఇబ్బందులు లేకుండా చేసేందుకు కూటమి సర్కారు ఆస్తి యాజమాన్య బదిలీని సులభతరం చేసింది. దీంతో ఇన్నాళ్లు సాగిన అవినీతి వ్యవహారాలకు చెక్ పడనుంది. రాష్ట్రంలో 17 కార్పొరేషన్ల పరిధిలో ఆటో మ్యుటేషన్ పద్ధతిని ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా కడప కార్పొరేషన్‌లో 1వ తేదీ శుక్రవారం నుంచి ఆటో మ్యుటేషన్ అమలు చేయనున్నారు. ఈ మేరకు జిల్లా రిజిస్ట్రార్ పీవీఎన్ బాబు సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేశారు.

గతంలో మ్యుటేషన్ అంటే కాసుల పండగే

కొనుగోలు చేసిన స్థిరాస్తులకు రిజిస్ట్రేషన్లు జరిగినప్పటికీ వారి పేరు మార్పు (మ్యుటేషన్) చేసుకోవాలంటే కార్పొరేషన్, రెవెన్యూ అధికారులు రకరకాల కొర్రీలు వేస్తూ చుక్కలు చూపించేవారు. ఇంటి పన్నులు, కుళాయి రశీదుల్లో పేరు మార్పు కోసం ఆస్తుల మార్కెట్ వాల్యూలో 1శాతం మ్యుటేషన్ ఫీజుగా ప్రభుత్వానికి చెల్లించాలి. సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. సచివాలయంలో డాక్యుమెంట్లు పరిశీలించిన అనంతరం ఆర్ఐ, ఆర్వో లాగిన్‌ల నుంచి కమిషనర్ లాగిన్‌కు చేరుతుంది. ఇక్కడ నుంచే అవినీతి సిబ్బంది ఆటలు మొదలవుతాయి. నిబంధనల మేరకు 14 రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలి. కానీ దళారులను రంగంలోకి దింపి తాము కోరిన ముడుపులు ఇచ్చేదాకా నెలల తరబడి సాగదీస్తూ వచ్చేవారు. ఇప్పుడు చంద్రబాబు సర్కారు మ్యుటేషన్లలో అవినీతికి చెక్ పెడుతూ ఏ రోజైతే ఆస్తులను రిజిస్ట్రేషన్లు చేసుకుంటారో అదే రోజున కొనుగోలుదారుల పేరుతో ఆటో మ్యుటేషన్ జరిగేలా తీసుకున్న నిర్ణయంతో స్థిరాస్థిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఒక్కరోజులోనే ఆటో మ్యుటేషన్



కార్పొరేషన్ పరిధిలో ఆస్తుల రిజిస్ట్రేషన్లు జరిగిన రోజే ఆస్తి యాజమాన్య బదిలీకి సంబంధించి ఆటో మ్యుటేషన్ పూర్తి అవుతుంది. దాన విక్రయ, పరివర్తన దస్తావేజుల రిజిస్ట్రేషన్ ద్వారా ఆస్థి పూర్తి స్థాయిలో బదలాయింపు జరుగుతుంది. స్థిరాస్థిదారులకు సంబంధించిన ఆస్తుల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక సీడీఎంఏ డేటాను రూపొందించింది. దీంతో భవిష్యత్తులో ఆస్థి వివాదాలు తగ్గుతాయి. పాత డోర్ నెంబర్లతో రిజిస్ట్రేషన్లకు పూర్తి బ్రేక్ పడనుంది.

- పీవీఎన్ బాబు, జిల్లా రిజిస్ట్రార్

సీడీఎంఏ డేటాలో ఆస్థి వివరాలు నిక్షిప్తం

రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ పరిధిలో ఆస్థుల రిజిస్ట్రేషన్లు, ఆటో మ్యుటేషన్ విధానంలో పారదర్శకత పాటించనుంది. ఒక ఆస్థి కొనుగోలు తరువాత యాజమాన్య బదలాయింపు వివరాలను కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) డేటా బేస్‌లో భద్రపరచనుంది. గతంలో 40-50 ఏళ్లనాటి ఇళ్లకున్న పాత డోర్ నెంబర్లపై అక్రమ ఆస్థుల రిజిస్ట్రేషన్లు సాగేవి. ఇవి కోర్టు వివాదాలకు దారి తీసేవి. ఆటోమ్యుటేషన్ ద్వారా ఇప్పుడు అలాంటి డోర్ నెంబర్లను ఆన్‌లైన్ సిస్టం గుర్తించదు. దీంతో పాత కాలం నాటి మనుగడలేని డోర్‌నెంబర్లతో తప్పుడు రిజిస్ట్రేషన్లకు చెక్ పడనుంది. ఇక ఆటో మ్యుటేషన్‌కు సంబంధించి ప్రభుత్వం ఆస్థి విలువను బట్టి ఆన్‌లైన్ సిస్టం ద్వారా లెక్కించిన ఫీజును వసూలు చేయనుంది. ఎస్ఎంఎస్ నోటిఫికేషన్లను, ఆన్‌లైన్ స్టేటస్ ట్రాకింగ్ వంటి సదుపాయాల ద్వారా దరఖాస్తుదారునికి ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకునే విధంగా (సీడీఎంఏ) ఏపీ ఇంటిగ్రేటెడ్ కచ్చితమైన ఆస్థి డేటాను అందించేలా రూపొందించారు.

గండికోటకు మహర్దశ : మంత్రి



విలేకరులతో మాట్లాడుతున్న పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, పక్కన ఇన్‌చార్జి మంత్రి సవిత, ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, చైతన్యరెడ్డి

జమ్మలమడుగు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతమైన గండికోటకు మహర్దశ రానుందని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. గురువారం సాయంత్రం గండికోటలోని అడ్వెంచర్ కోర్సు అకాడమీలో విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర వ్యాప్తంగా రూ.165 కోట్ల విలువైన అయిదు పర్యాటక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేస్తారన్నారు. అందులో భాగంగా గండికోటలో పలు పర్యాటక ప్రాజెక్టులకు సంబంధించి శంకుస్థాపనలు చేస్తారన్నారు. దీంతో జిల్లా గ్రాండ్ కాన్యన్ ఆఫ్ ఇండియాగా పిలిచే గండికోట వారసత్వ సంపదకు మహర్దశ రానుందని తెలిపారు. టూరిజం ఎండీ ఆమ్రపాలితో కలిసి కోటలోని అన్ని ప్రాంతాలు, ఆలయాలు, గిడ్డంగి, మీనార్‌లు తదితరవన్నీ పరిశీలించామన్నారు. కేంద్ర ప్రభుత్వం శాస్కి స్కీం ద్వారా మంజూరైన రూ.77.91 కోట్లతో గండికోట పర్యాటక ప్రాజెక్టు పనులకు ముఖ్యమంత్రి స్వయంగా వచ్చి శంకుస్థాపనలు చేస్తారన్నారు. ఇందులో వ్యూ పాయింట్, చారిత్రక వారసత్వ కట్టడాల అభివృద్ధికి రూ.28 కోట్లు, బోటింగ్ సదుపాయాలకు రూ.1.25 కోట్లు, పర్యాటకుల సందర్శన, ఇతర అభివృద్ధికి రూ.12.73 కోట్లు, సేవా కేంద్రాలకురూ.15.11 కోట్లు, టెంట్‌సిటీ అభివృద్ధికి రూ.5.05 కోట్లు, వనరుల పరిరక్షణకు రూ.2.62 కోట్లు, గార్డ్ వైభవానికి రూ.89 లక్షలతో పనులు చేపట్టనున్నట్లు తెలి పారు. అలాగే గండికోటలో 30 పాలీష్ టెంట్లు ఏర్పాటు చేస్తామన్నారు. గండికోటను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గండికోట పోర్ట్ అద్భుతమైన కట్టడమని, ఇందులో భాగంగా వివిధ కట్టడాలతో పాటు పురాతన రంగనాథస్వామి ఆలయం, జుమ్మామసీదును అనుసంధానించి పాత్‌వే ఏర్పాటు ద్వారా సందర్శకులకు సౌకర్యవంతంగా చేస్తామన్నారు. సహజసిద్ధంగా ప్రవహిస్తున్న నదీ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. మినీ థియేటర్, చిల్డ్రన్‌ఏరియా, ప్రకృతి సౌందర్యాలు వీక్షించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. అలాగే గండికోటలో అయిదు స్టార్‌హోటళ్ల ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజు 8 నామినేషన్లు

కడప రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు రెండవ రోజు గురువారం 8 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో ఆరు వైసీపీ, ఒకటి జనసేన, ఒకటి ఇండిపెంట్‌గా వేశారు. పులివెందుల జడ్పీటీసీ స్థానానికి తుమ్మల హేమంత్‌రెడ్డి(వైసీపీ), తుమ్మల ఉమాదేవి(వైసీపీ) ఒక్కొక్కరు రెండు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. అలాగే ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానానికి కోనేటి హరి వెంకటరమణ(జనసేన), వై.మధుమూర్తి(ఇండిపెండెంట్), ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి (వైసీపీ), టక్కోలి శివారెడ్డి(వైసీపీ) నామినేషన్లు వేశారు. పులివెందుల జడ్పీటీసీ స్థానానికి నామినేషన్లు వేసిన వారి వెంట వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి, ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మాజీ మంత్రి అంజద్‌బాషా, మేయర్ సురేశ్‌బాబు, జడ్పీ వైస్ చైర్మన్ పిట్టు బాలయ్య యాదవ్ తదితరులు వచ్చారు.

నిబంధనల ఉల్లంఘన

ఎన్నికల నిబంధనల ప్రకారం ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్(ఆర్వో) కార్యాలయంలోకి నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే అనుమతి ఉంది. అది కూడా ఒక అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసిన తరువాత మరో అభ్యర్థి ఆర్వో కార్యాలయంలోకి రావాలి. అభ్యర్థుల తరుపున వచ్చిన నేతలు, నాయకులు, కార్యకర్తలు 100 మీటర్ల దూరం వెలుపలనే ఉండాలి. ఈ నిబంధనలను వైసీపీ నేతలు పాటించలేదు. అధికారులూ పట్టించుకోలేదు.

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు



లోకేష్ (కడప)

కడప స్పోర్ట్స్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగు తున్న అండర్-16 మెన్ మల్టీడే (మూడురోజుల) క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా ఆటకు చివరి రోజైన గురువారం రెండు వేర్వేరు జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. వివరాలిలా...

కడప నగర రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో కడప-అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 53.1 ఓవర్లలో 186 పరుగులకు ఆలౌట్ కాగా, కడప జట్టు 53.3 ఓవర్లలో 158 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. దీంతో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన అనంతపురం జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 70 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 242 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోర్‌తో తిరిగి మూడో రోజు బ్యాటింగ్‌కు దిగి 84.4 ఓవర్లలో 325 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఈ జట్టులోని ఆదినారాయణరెడ్డి 156 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. తదుపరి రెండో ఇన్నింగ్స్‌కు దిగిన కడప జట్టు చివరి రోజు ఆట ముగిసే సమయానికి 67.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 269 పరుగులు చేసింది. ఇందులో లోకేష్ 85 పరుగులు చేశారు. దీంతో ఆట డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.

కేవోఆర్ఎం మైదానంలో చిత్తూరు-కర్నూలు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 92.1 ఓవర్లలో 325 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలి సిందే. అనంతరం కర్నూలు జట్టు 100 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 300 పరుగులు చేసిది. దీంతో చిత్తూరు జట్టుకు 25 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన చిత్తూరు జట్టు 71.1 ఓవర్లలో 215 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు చివరిరోజు ఆట ముగిసే సమయానికి 12 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 103 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

ఓవరాల్ చాంపియన్‌గా కడప క్లస్టర్ విద్యార్థులు

● ముగిసిన నవోదయ విద్యార్థుల యోగా పోటీలు



ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించిన కడప క్లస్టర్ విద్యార్థులు

చిలకలూరిపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం జవహర్ నవోదయ విద్యాలయంలో మూడు రోజులపాటు నిర్వహించిన దక్షిణ భారత దేశ స్థాయి విద్యార్థుల యోగా పోటీలు గురువారం ముగిసాయి. కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన 77 నవోదయ విద్యాలయాల విద్యార్థులు 278 మంది ఈ పోటీలలో పాల్గొన్నారు. వివిధ విభాగాలుగా నిర్వహించిన ఈ పోటీలలో కడప క్లస్టర్ నవోదయ విద్యార్థులు ఓవరాల్ చాంపియన్ షిప్‌ను, కృష్ణా క్లస్టర్ విద్యార్థులు రన్నర్స్ ఛాంపియన్ షిప్‌ను సాధించారు. వివిధ క్లస్టర్ల నుంచి నవోదయ జాతీయ యోగా పోటీలకు ఎంపికైన 21 మంది విద్యార్థులు, 21 మంది విద్యార్థినులను మెడల్స్, సర్టిఫికెట్లతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పల్నాడు జిల్లా డిఎంహెచ్‌వో డాక్టర్ బి రవి మాట్లాడుతూ యోగా ఇప్పుడు దేశ విదేశాలలో ఎంతో మందిని ఆకర్షిస్తున్నదని అన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి ఉత్తమ సాధనం యోగా అని చెప్పారు. విద్యాలయ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు మాట్లాడుతూ యోగ పోటీలలో పాల్గొని నవోదయ జాతీయ క్రీడల పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రశంసించారు. కాగా ఆగస్టు 28, 29, 30 తేదీలలో నవోదయ విద్యార్థుల జాతీయ స్థాయి యోగా పోటీలు కూడా మద్దిరాల జవహర్ నవోదయ విద్యాలయాలోనే నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపల్ నరసింహారావు తెలిపారు.

ఆటో ఢీకొని యువకుడి మృతి



మృతి చెందిన యువకుడు మణికంఠ


కడప క్రైం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రైల్వే స్టేషన్ రోడ్డు సమీపంలో గురువారం రాత్రి వేగంగా వచ్చి ఆటో ఢీకొనడంతో మణికంఠ (19) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు వన్‌టౌన్ ఎస్ఐ అమరనాథరెడ్డి తెలి పారు. కమలాపురం మండలం పుట్లంపల్లె గ్రామానికి చెందిన మణికంఠ బుధవారం సొంత పని నిమిత్తం కడపకు వచ్చాడు. రాత్రి బైకులో తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో ఆటో వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో మణికంఠ అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి విచారిస్తున్నామన్నారు. కాగా, మణికంట తల్లిదండ్రులు గంగాదర్, శైలజ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. చేతికి వచ్చిన కుమారుడి మృతితో బోరున విలపిస్తున్నారు.

అదృశ్యమైన విద్యార్థిని ఆచూకీ లభ్యం

● తండ్రికి అప్పగించిన పోలీసులు

చాపాడు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కళాశాలకు వెళుతున్నానని చెప్పి అదృశ్యమైన విద్యార్థిని ఆచూకీ తెలుసుకొని ఆమె తండ్రికి అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. వివరాల మేరకు... మండల కేంద్రమైన ఖాజీపేటకు చెందిన సుంకు వెంకట మీనాక్షి చాపాడులోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతోంది. కాలేజీకి వెళుతున్నానని చెప్పి ఈనెల 29న మంగళవారం అదృశ్యమైంది. ఆమె తండ్రి ఫిర్యాదు కేసు నమోదు చేసిన పోలీసులు సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా వెంకటమీనాక్షి తిరుపతిలో ఉన్నట్లు గుర్తించారు. అక్కడ నుంచి తీసుకువచ్చి తండ్రి శ్రీనివాసులుకు అప్పగించినట్లు తెలిపారు.

యూనిఫాం వెనక్కు ఇవ్వలేదని...



విద్యార్థిని చెంపపై పడిన వాతలు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): యూనిఫాం వెనక్కు ఇవ్వలేదని నడింపల్లె మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థినిపై ఉపాధ్యాయురాలు చెయ్యి చేసుకున్న ఘటన చర్చనీ యాంశంగా మారింది. ముల్లా జుబేరియా అనే విద్యార్థిని దస్తగిరిపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. ఆ విద్యార్థిని పాఠశాలలో యూనిఫాం అందజేసిన తర్వాత నడింపల్లె మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో చేరింది. తమ పాఠశాలలో తీసుకున్న యూనిఫాంవెనక్కు ఇవ్వాలని దస్తగిరిపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు షేక్ సబీహా మరొక విద్యార్థితో చెప్పి పంపింది. యూనిఫాం ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన ఆ ఉపాధ్యాయురాలు గురువారం విద్యార్థిని చదువుతున్న పాఠశాలకు వెళ్లి తరగతి గదిలో ఉన్న విద్యార్థిని చెంపపై కొట్టి వెళ్లిపోయింది. విద్యార్థి ఏడుపు విన్న తరగతి గదిలోని ఉపాధ్యాయురాలు సంపూర్ణ వచ్చి చూడగా విద్యార్థిని చెంపపై వాతలు కనిపించాయి. దీంతో హెడ్మాస్టర్ శంకర్ దృష్టికి విషయం తీసుకెళ్లింది. హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు సబియాపై ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం పాఠశాలకు వెళ్లి విచారించి ఆ ఉపాధ్యాయురాలిపై తగిన చర్యలు తీసుకుంటామని ఎంఈవో శోభారాణి తెలిపింది.

ఈశ్వరీదేవి మఠం ఆలయ పునర్నిర్మాణానికి రూ.10 లక్షలు విరాళం



మఠాధిపతికి చెక్కును అందిస్తున్న కాణాల మల్లికార్జునరెడ్డి

బ్రహ్మంగారిమఠం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారిమఠం ఆలయ పునర్నిర్మాణం కోసం టీడీపీ మండల యువ నాయకుడు కాణాల మల్లికార్జునరెడ్డి రూ.10లక్షలు విరాళం అందజేశారు. బి.మఠం మండలం డి.అగ్రహారం గ్రామానికి చెందిన మల్లికార్జునరెడ్డి ఆయన సతీమణి మాధవీరెడ్డిలు గురువారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, టీడీపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, దేవస్థాన కార్యనిర్వాహక అధికారి బీవీ జగన్ మోహన్‌రెడ్డి సమక్షంలో మఠాధిపతి వీరశివ కుమారస్వామికి చెక్కును అందజేశారు. ఈసందర్భంగా వారు మల్లికార్జునరెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైవీయూలో ప్రశాంతంగా ఇంటర్వ్యూలు



కడప ఎడ్యుకేషన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వైవీయూలో ఎమ్మెస్సీ మైక్రో బయాలజీ గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం కోసం గురువారం నిర్వహించిన ఇంటర్వ్యూలు ప్రశాంతంగా ముగిశాయి. విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ మార్గదర్శకంలో ఇంటర్వ్యూలు కొనసాగాయి. సైన్స్ విభాగ డీన్ ప్రొఫెసర్ ఏజీ దాము, తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ వైరాలజీ ప్రొఫెసర్ జి.నరసింహ, మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుభాష్‌చంద్ర, ప్రొఫెసర్లు డి.విజయరాఘవ ప్రసాద్, ఎల్.వీరాంజనేయరెడ్డి, డి.విజయలక్ష్మిలు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వైవీయూ రిజిస్ట్రార్ పి.పద్మ పర్యవేక్షించారు. ప్రిన్సిపాల్ కార్యాలయ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో చెత్త పన్ను పేరుతో లూటీ

● జేసీ ఆధ్వర్యంలో పూర్తిస్థాయి విచారణ

● టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో చెత్త పన్ను పేరుతో ప్రజలను లూటీ చేశారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. జేసీ అధ్యక్షతన పూర్తిస్థాయిలో విచారణ జరిపించి నిగ్గు తేలుస్తామని స్పష్టం చేశారు. గురువారం కడపలోని ద్వారకానగర్‌లోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ చెత్త పన్ను వసూళ్లలో జరిగిన అక్రమాలపై జాయింట్ కలెక్టర్‌తో పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే మాధవి కలెక్టర్‌కు ఫోన్ చేసి మాట్లాడారన్నారు. అక్రమార్కుల నిగ్గు తేల్చి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని లేఖ కూడా రాశారన్నారు. ఇందుకు కలెక్టర్ స్పందించి జేసీ ఆధ్వర్యంలో విచారణ కమిటీని నియమించి నిజాలు నిగ్గు తేలుస్తామని చెప్పడం జరిగిందన్నారు. ఈ విచారణలో అధికారులతో పాటు గత ప్రభుత్వ పెద్దల పాత్ర కూడా తేలుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పాల్గొన్నారు.

చిత్రావతి నదికి నీటి విడుదల

లింగాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్నపల్లె సమీపంలో ఉన్న చిత్రావతి నదికి సీబీఆర్ (చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్) నుంచి గురువారం పీబీసీ అధికారులు నీటిని విడుదల చేశారు. చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో తాగు, సాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా నదికి నీటిని విడుదల చేయాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నాలుగు రోజుల పాటు 125క్యూసెక్కుల మేర నీటిని నదికి విడుదల చేస్తామని పీబీసీ అధికారులు తెలిపారు.

పరిహారం కోసం ఎదురుచూపు

కూటమి ప్రభుత్వంపై ఆశలు

సీఎం ఆదుకోవాలని విజ్ఞప్తి



తాళ్లప్రొద్దుటూరు పునరావాస కాలనీలో డ్రైనేజీ లేక దుస్థితి

కొండాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం గండికోట నిర్వాసితుల సమస్యలను గాలికొదిలేసింది. దీంతో నిర్వాసితులు పరిహారం, మౌలిక సదుపాయాల కోసం కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెంచుకున్నారు. ఇదివరకే రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామనాయుడు గండికోట ప్రాజెక్టును సందర్శించి, నిర్వాసితులను కలిసి వారి సమస్యలను కూడా తెలుసుకున్నారు. శుక్రవారం జమ్మలమడుగు పర్యటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తున్న నేపథ్యంలో తమ సమస్యలను పరిష్కరించేందుకు ఆయన చొరవ చూపాలని గండికోట నిర్వాసితులు కోరుతున్నారు

రూ. 454 కోట్ల పరిహారానికి జీవో ఇచ్చి గాలికొదిలేసి..

గండికోట ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో నీళ్లు తామే మొదటిసారిగా నింపినట్లు గొప్పలు చెప్పుకున్న గత వైసీపీ ప్రభుత్వం నిర్వాసితులకు పరిహారం చెల్లించడంలో పూర్తిగా విఫలమయ్యింది. ఎన్నికలకు తొమ్మిది నెలల ముందు 2023 జూలై 6న గండికోట నిర్వాసితుల పరిహారం కోసం రూ.454.6 కోట్లు విడుదల చేస్తున్నట్లు జీవో ఇచ్చింది. మొదటి విడత 14 ముంపు గ్రామాలుకు అదనపు పరిహారం కింద ఒక్కొక్కరికి రూ. 3,25,000 చొప్పున 9096 మంది నిర్వాసితులకు రూ.295.62 కోట్లు విడుదల చేయనున్నట్లు జీవోలో ఉంది. అదేవిధంగా రెండో విడత 8 గ్రామాల్లో పెండింగ్ ఉన్న 573 మంది నిర్వాసితులకు రూ.58.3 కోట్లు ఇవ్వనున్నట్లు తెలిపింది. కొండాపురం పట్టణంలో సప్లిమెంటరీ జాబితా కింద 547 మంది నిర్వాసితులకు రూ.53.86 కోట్లు ఇస్తామంది. అదే విధంగా మొదటివిడత 14 ముంపు గ్రామాల్లో పూర్తిగా పరిహారం అందని నిర్వాసితులకు రూ.46.77 కోట్లు ఇవ్వనున్నట్లు జీవోలో తెలిపింది. మొత్తం 22 గ్రామాలకు పరిహారం కింద 18,204 నిర్వాసిత కుటుంబాలకు రూ.454.6 కోట్లు విడుదల చేయనున్నట్లు పేర్కొంది. ఇందుకు సంబంధించి కనీసం ఒక్క రూపాయి కూడా పరిహారాన్ని నిర్వాసితులకు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం చేతులెత్తేసింది. దీంతో పరిహారం కోసం నిర్వాసితులు కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు.

మంత్రి దుర్గేశ్‌కు ఘన స్వాగతం



కడప సెవెన్ రోడ్స్, జూలై 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సినిమాటోగ్రఫీ, పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేశ్‌కు కడప జనసేన పార్టీ నాయకుడు తుంగా రమణయ్య ఘనస్వాగతం పలికారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా గురువారం కడపకు విచ్చేసిన మంత్రి కందుల దుర్గేశ్‌ను విమానాశ్రమంలో కలిశారు. అనంతరం శాలువతో సత్కరించారు.

పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

● సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్

కడప రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బాలుర వసతి గృహం, పరిశీలన గృహాలలోని పిల్లల ఆరోగ్య విషయాల పట్ల నిర్వాహకులు తగిన శ్రద్ధ వహించాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ అన్నారు. గురువారం వసతి గృహాలను పరిశీలించి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి పరిసరాలను, జీవన పరిస్థితులు, భద్రత, ఆరోగ్యం, పరిశుభ్రత, ఆహారం, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ బాలల రక్షణ కోసం స్నేహపూర్వక న్యాయసేవల పథకం గురించి వివరించారు. అలాగే కడప నగరం ఎర్రముక్కపల్లెలోని గాంధీనగర్ పాఠశాలలోని లీగల్ లిటరసీ క్లబ్‌ను విజిట్ చేశారు. ఇందులోని న్యాయసంభరిత పుస్తకాలను, కంప్యూటర్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఔట్‌సోర్సింగ్ సిబ్బంది జీతాలు చెల్లించాలి

కడప సెవెన్ రోడ్స్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపై వివక్షచూపుతూ జీతాలు చెల్లించకపోవడం తగదని, వెంటనే వారికి చెల్లించాలని జీతాలు చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రెగ్యులర్ టీచింగ్ టైం స్కేల్, డైలీ వేజ్ ఇతర ఉద్యోగులకు సమయానికి చెల్లించి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు చెల్లించకపోవడంపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. జీతాలు అందకపోవడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతినెల 16 నుంచి 25వ తేదీ వరకు జీతాల బిల్లులు సీఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడం వల్ల ప్రతినెల 1వ తేదీన జీతాలు చెల్లిస్తోందన్నారు. అయితే వైవీయూ మాత్రం 1 దాటి 30 రోజులు అవుతున్నా జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు.

బ్రౌన్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

కడప నాగరాజుపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా సముద్ధారకుడు, తెలుగు సూర్యుడిగా పిలువబడే చార్లెస్ బ్రౌన్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు జీవో విడుదల చేయాలని కడప బ్రౌన్ గ్రంథాలయ సలహా మండలి సభ్యుడు జానమద్ది విజయభాస్కర్ గురువారం ఒక ప్రకటనలో ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై పలుమార్లు లేఖలు కూడా రాశామన్నారు. రాష్ట్రపర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, కడప జిల్లా నోడల్ అధికారి సౌరభ్‌గౌర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత బ్రౌన్ గ్రంథాలయాన్ని సందర్శించి తప్పకుండా బ్రౌన్ జయంతిని ప్రభుత్వం నిర్వహించేలా ప్రయత్నిస్తామని తెలిపారని, ఆరునెలలుగా దీనికి సంబంధించిన ఫైల్ ముఖ్యమంత్రి పేషీలో పెండింగ్‌లో ఉందని తెలిసిందన్నారు. ఈ విషయమై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు.

నేడు పింఛన్ల పంపిణీ

కడప క్రైం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసాపింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టనున్నట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టరు డాక్టర్ రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జూలై నెలకు సంబంధించిన పింఛను మొత్తం రూ.171.68 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఒంటిమిట్ట, పులివెందులలో జడ్పీటీసీ ఉప ఎన్నికలు జరుగతున్నందు వల్ల కడప, పులివెందుల డివిజన్ల పరిధిలో కొత్తగా మంజూరైన వితంతు పింఛన్లు ఆగస్టు 1న కాకుండా సెప్టెంబరు 1 నుంచి పంపిణీచేయనున్నట్లు తెలిపారు.

కమలాపురం నగర కమిషనర్‌గా రాంబాబు



కమలాపురం రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): కమలాపురం నగర పంచాయతీ కమిషనరు (ఎఫ్‌సీ)గా రాంబాబు బాధ్యతలు చేపట్టారు. కడప కార్పొరేషన్‌లో డిప్యూటీ కమిషనరుగా పనిచేస్తున్న రాంబాబుకు కమలాపురం కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో గురువారం ఆయన కమలాపురంలోని నగర పంచాయతీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ నగరపంచాయతీ పరిధిలో పెండింగులో ఉన్న అభివృద్ధి పనుల పూర్తికి కృషి చేస్తానన్నారు. అలాగే ప్రజలు పన్నులు సకాలంలో చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

వీరపునాయునిపల్లె ఎంఈవోగా నరసింహులు



వీరపునాయునిపల్లె, జూలై 31(ఆంధ్రజ్యోతి): వీరపునాయునిపల్లె మండల విద్యాశాఖ అధికారిగా ఎం.నరసింహులు గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇన్‌చార్జి ఎంఈవోగా సావిత్రమ్మ విధులు నిర్వహించేవారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పులివెందుల ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న సోషల్ టీచర్ నరసింహులుకు పదోన్నతి కల్పించారు. ఈ మేరకు వీరపునాయునిపల్లె ఎంఈవోగా బాధ్యతలు చేపట్టారు.

సింహాద్రిపురానికి పూల ఖాదర్‌బాషా..



సింహాద్రిపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): సింహాద్రిపురం మండల విద్యా శాఖాధికారి-1గా పూల ఖాదర్ బాషా గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో కొండాపురం ఎంఈవో ఓబులేసు ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహించేవారు. ప్రస్తుతం రెగ్యులర్ ఎంఈవోగా ఖాదర్‌బాషా బాధ్యతలు చేపట్టారు.

సీకెదిన్నెకు వెంకటసుబ్బరాయుడు..



సీకేదిన్నె, జూలై 31(ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె విద్యాశాఖాధికారి-1గా కె.వెంకటసుబ్బరాయుడు గురువారం బాధ్యతలు చేపట్టారు. పెండ్లిమర్రి ఎంఈవో సుజాత ఇక్కడ అదనపు బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం ఆమె స్థానంలో సుబ్బరాయుడు పూర్తి బాధ్యతలు చేపట్టారు.

లింగాలకు విశ్వనాథ్‌రెడ్డి..



లింగాల, జూలై 31(ఆంధ్రజ్యోతి): లింగాల ఎంఈఓ-1గా విశ్వనాథ్‌రెడ్డి గురువారం ఎంఆర్‌సీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు ఎంఈఓ-1గా పనిచేసిన శ్రీనివాసరెడ్డి బదిలీపై వెళ్లడంతో పులివెందుల సత్రం బడిలో పనిచేస్తున్న విశ్వనాథ్‌రెడ్డిని లింగాలకు నియమిస్తూ ఆర్జేడీ ఉత్తర్వులు జారీ చేశారు.

సీపీఐ మండల కార్యదర్శిగా అమీర్‌బాషా



సింహాద్రిపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): సింహాద్రిపురం మండల సీపీఐ కార్యదర్శి గా కోవరంగుట్టపల్లికి చెందిన అమీర్‌బాషాను ఎంపిక చేసినట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తెలిపారు. గురువారం అంకాళమ్మగూడూరులో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా అమీర్‌బాషా, సభ్యులుగా అనీల్, అంకన్న, రామ్మోహన్, సురేష్, వినయ్, ఈశ్వరయ్య, మారుతీకుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వెంకట రాములు, బ్రహ్మం, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

పులివెందుల జడ్పీటీసీ పోటీపై

తుది నిర్ణయం అధిష్ఠానానిదే..

● మంత్రి సవిత ● పోటీ చేసేందుకు మా కుటుంబం సిద్ధం : బీటెక్ రవి



పులివెందులలో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

పులివెందుల, జూలై 31(ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక బరిలో దిగే తుది నిర్ణయం అధిష్ఠానానిదే అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. మంత్రి సవిత జమ్మలమడుగులో జరిగే సీఎం పర్యటనకు సంబంధించి ఏర్పాట్ల పరిశీలనకు వెళ్తూ గురువారం పులివెందులకు వచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల జడ్పీటీసీ చనిపోవడంతో ఉప ఎన్నికలు వచ్చాయన్నారు. గురువారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా పర్యటనలో భాగంగా జమ్మలమడుగుకు వస్తున్నారని, పులివెందుల జడ్పీటీసీ విషయమై చర్చిస్తామన్నారు. అనంతరం పొలిట్ బ్యూరో సభ్యుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అధిష్ఠానం నిర్ణయం మేరకే ముందుకెళ్తామన్నారు. పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) మాట్లాడుతూ పులివెందుల జడ్పీటీసీ రెండున్నర సంవత్సరాల క్రితం మృతి చెందడంతో ఉప ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైందన్నారు. ఈ స్థానం నుంచి జడ్పీటీసీగా పోటీచేసేందుకు తన కుటుంబ సభ్యులు బరిలో దిగేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి తదితరులు ఉన్నారు. కాగా పులివెందులలోని పార్టీ కార్యాలయంలో మంత్రిని కలిసేందుకు ప్రజలు, అభిమానులు తరలివచ్చారు. పలువురు వారి సమస్యలను మంత్రికి విన్నవించుకున్నారు. సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ చాంద్‌బాష

పులివెందుల, జూలై 31(ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల సందర్భంగా ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని అర్బన్ సీఐ చాంద్‌బాష తెలిపారు. గురువారం రాత్రి మండలంలోని ఇ.కొత్తపల్లె, ఎర్రబల్లె, నల్లపురెడ్డిపల్లె గ్రామాల్లో ఆయన ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉప ఎన్నిక సందర్భంగా గ్రామాల్లో ఘర్షణ వాతావరణం లేకుండా శాంతియుతంగా ఉండాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే నాటుసారా అమ్మకాలు, బెల్టుషాపుల నిర్వహిస్తున్న వారి వివరాలను పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున గ్రామాలలో గుంపులుగా ఉండరాదన్నారు. ఎన్నికల నియమావళిని అనుసరించాలని, లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

4న కార్పొరేషన్ ఎదుట సీపీఎం ఆందోళన

కడప సెవెన్‌రోడ్స్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్‌లో జరుగుతున్న చెత్త పన్ను వసూలు, కుక్కల ఆపరేషన్, ఫుట్‌పాత్ వసూళ్లు, అడిషనల్ కార్మికుల సంఖ్య, వేతనాలపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈనెల 4వ తేదీన ఆందోళన చేపడుతున్నట్లు సీపీఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ తెలిపారు. గురువారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటి నుంచి వసూలు చేసే చెత్త పన్నును ప్రభుత్వం రద్దు చేసిందని, కానీ అపార్ట్‌మెంట్లు, హోటళ్లు, హాస్పిటళ్లు, షాపింగ్ మాల్స్, వస్త్ర పరిశ్రమలు లాంటి వాణిజ్య, వ్యాపార సంస్థల నుంచి వసూలు చేస్తున్న చెత్తపన్నులో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందన్నారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు.

5న విద్యుత్ భవన్ వద్ద ఆందోళన

కడప సెవెన్ రోడ్స్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల దోపిడీ విధానంపై రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పిందని, ఈ క్రమంలో ప్రజాసంఘాల రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఈనెల 5వ తేదీన స్థానిక విద్యుత్ భవన్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్నట్లు రైల్వే గూడ్స్ షెడ్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శులు కేసీ బాదుల్లా, ఎస్.మహబూబ్ బాష తెలిపారు. గురువారం స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణంలోని యూనియన్ కార్యాలయంలో పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ భవన్ వద్ద జరిగే ఆందోళనలో కార్మికవర్గం పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమలో యూనియన్ నాయకులు పాల్, శ్రీను, చిన్న ఓబులేసు, నాగేంద్ర, గంగయ్య, సూర, సుబ్బరామ్, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిది నెలల జీతాలు పెండింగ్



సమావేశంలో మాట్లాడుతున్న నాగసుబ్బారెడ్డి తదితరులు

కడప సెవెన్‌రోడ్స్, జూలై 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలలో (కేజీబీవీ) కాంట్రాక్టు పద్ధతిన విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఎస్ఎస్ఏలో ఓపక్క నిధులున్నా తొమ్మిది నెలలుగా ఇన్‌చార్జి మినిస్టర్ సంతకాలు చేయలేదనే నెపంతో వేతనాలు లేవని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి అన్నారు. స్థానిక హోచిమిన్ భవన్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్ శ్రీధర్, ఇన్‌చార్జి మంత్రి సవితకు అనేకమార్లు విన్నవించినా ఫలితం లేదని, స్థానిక ప్రజాప్రతినిధుల రెఫరెన్స్ లెటర్లు తీసుకురావాలనడం సబబు కాదన్నారు. ఆ ఫైల్‌పై మంత్రి సంతకాలు చేయకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, నగర సెక్రటరీ ఉద్దె మద్దిలేటి, పి.సుబ్బరాయుడు పాల్గొన్నారు.

3న జాబ్‌మేళా

లింగాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 3వ తేదీన ఆదివారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్నరాణి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆమె మాట్లాడుతూ పలు కార్పొరేట్ సంస్థలు ఈ జాబ్‌మేళాలలో పాల్గొంటున్నాయన్నారు. ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

సమస్యలు పరిష్కరించేందుకు కృషి

చక్రాయపేట, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని టీడీపీ మండల ఇన్‌చార్జి తాళ్లపల్లె మహేశ్వరరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సురభి, కోమటిపేట, గాజులపేట, నాగులగుట్టపల్లె గ్రామాలలో ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో నీటి సమస్య ఉందని తెలుసుకొని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి పరిశీలించారు. సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను మహేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ' అమలు నిర్ణయం హర్షణీయం

వేంపల్లె, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆలస్యంగానైనా చంద్రబాబు ప్రభు త్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని ఆగస్టు 2నుంచి అమలు చేయా లని నిర్ణయించడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధి కార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. ఈ పథకం అమలుపై ఆంక్షలు పెట్టవద్దని ప్రభుత్వానికి సూచించారు. ప్రతి ఏటా రైతుకు రూ.20వేల ఆర్థికసాయం చేస్తామ న్న ప్రకారమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2024-25లో ఈ పథకం కింద ప్రభుత్వం ఆర్థికసాయం చేయలేదు కాబట్టి ఆ మొత్తాన్ని కూడా రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. అలాగే కౌలురైతులకు కూడా ఈ పథకాన్ని అమలు చేయాలన్నారు.

ఆర్టీసీ బస్టాండు వద్ద పార్కింగ్ వాహనాలపై విరిగిపడిన చెట్టుకొమ్మలు



విరిగిపడిన చెట్టు కొమ్మలు

కడప మారుతీనగర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): కడప ఆర్టీసీ బస్టాండ్ నిత్యం వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణీకులతో రద్దీగా ఉంటుంది. వివిధ ప్రాంతాలలో ఉద్యోగాలు చేసేవారు, సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చేవారు తమ వాహనాలను బస్టాండు ఆవరణలో పార్కింగ్ చేస్తుంటారు. కానీ కొందరు పార్కింగ్ ప్రదేశాల్లో పార్కింగ్ చేయకుండా ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలపడం పరిపాటిగా మారింది. ఇదిలా వుండగా గురువారం వీచిన గాలులకు బస్టాండ్‌లో ఉన్న చెట్టు కొమ్మలు రెండు విరిగిపడ్డాయి. దీంతో ఆ చెట్టు కింద పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలపై కొమ్మలు పడడంతో వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. కానీ వాహనాల పార్కింగ్ ప్రదేశంలో వుంచినట్లయితే దెబ్బతినే అవకాశమే లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

గృహహింస చట్టం అమలులో.. స్వచ్ఛంద సంస్థలకు సంబంధం లేదు

● జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి పి.రమాదేవి

కడప ఎన్టీఆర్ సర్కిల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): గృహహింస చట్టం అమలులో స్వచ్ఛంద సంస్థలకు ఎలాంటి సంబంధం లేదని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి పి.రమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన కొన్ని స్వచ్ఛంద సేవా సంస్థలు గృహహింస చట్టం-2005 అమలులో ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారని, ఇది పూర్తి అసత్యమని తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలోని స్త్రీ శిశు సంక్షేమ సాధికారత అధికారి కార్యాలయం ద్వారా మాత్రమే అమలు చేయబడుతుందని వివరించారు. ఈ క్రమంలో అసత్యపు ప్రచారాలను ఎవరూ నమ్మవద్దని పేర్కొన్నారు. కుటుంబంలో మహిళల పట్ల ఎలాంటి హింసలకు పాల్పడినా రాజ్యాంగబద్ధంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలు గృహహింస నుంచి రక్షణ పొందేందుకు తమ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆమె సూచించారు.

కార్పొరేషన్ అవినీతిపై జేసీ అధ్యక్షతన విచారణ జరిపించాలి

● కలెక్టర్‌కు ఎమ్మెల్యే మాధవి లేఖ

కడప ఎర్రముక్కపల్లె, జూలై 31(ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్ పరిధిలో జరిగిన అవినీతి, అక్రమాలపై జేసీ అధ్యక్షతన విచారణ కమిటీ నియమించి తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మాధవి గురువారం కలెక్టర్‌కు లేఖ రాశారు. కడప మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగిన వివిధ చట్టవిరుద్ధ కార్యకలాపాలు, అవినీతి ఆరోపణలపై వారం రోజులుగా వార్తాపత్రికలలో వరుస కథనాలు ప్రచురితమవుతున్నాయని, అలాగే ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియాలో కూడా ప్రసారం అవుతున్నాయన్నారు. ఈ ఆరోపణలపై వివరాణాత్మక దర్యాప్తును ఏర్పాటు చేయడానికి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడానికి జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన ఒక విచారణ కమిటీని రూపొందించాలని కలెక్టర్‌ను కోరారు.

చెత్తపన్ను అవినీతిపై విచారణ జరపాలి

● సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గుంటి వేణుగోపాల్

కడప మారుతీనగర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ పరిధిలోని 21వ డివిజన్ శానిటేషన్ విభాగంలో చోటుచేసుకున్న చెత్తపన్ను అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన వారి ఆస్తులు జప్తు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గుంటి వేణుగోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 21వ డివిజన్‌లో ఇంటింటికీ చెత్తపన్ను, బార్లు, హోటళ్లు, హాస్పిటళ్లు, కమర్షియల్‌కు సంబంధించిన అన్ని భవనాల నుండి పెద్దఎత్తున చెత్తపన్ను వసూలు చేయడం జరిగిందన్నారు. ఆ అక్రమాలకు పాల్పడిన 21వ డివిజన్ సచివాలయం రవికుమార్‌పై ఆర్థిక నేరం కింద కేసు నమోదు చేయాలన్నారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

తీసిన పూడికను తొలగించాలి

కడప మారుతీనగర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని 49వ డివిజన్ ఆలంఖాన్‌పల్లె గ్రామ నడిబొడ్డున ఉన్న దాదా కాల్వలో ఇటీవల తీసిన పూడికను త్వరి తగతిన తొలగించాలని ఏపీ వికలాంగుల హక్కుల పోరాట సమితి (ఏపీవీహెచ్‌పీఎస్) జిల్లా మహిళా అధ్యక్షురాలు పి.ఈశ్వరమ్మ కార్పొరేషన్ అధికారులను కోరారు. గురువారం ఆమె మాట్లాడుతూ దాదా కాల్వలో పేరుకుపోయిన పూడికను తీసి రోడ్డుపై పడేసి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీంతో ఆ రోడ్డు మార్గాన వెళ్లే కాలనీవాసులకు ఇబ్బందికరంగా ఉందని, పైపెచ్చు ఆ సిమెంట్ రోడ్డు గుంతలు పడి ఉండటంతో వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాల బారిన పడక తప్పదని వాపోయారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి పూడికతో పాటు గుంతలను కూడా త్వరితగతిన పూడ్చాలని కోరారు.

దేవర ఎద్దుకు స్మృతి కార్యక్రమం

చక్రాయపేట, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలేకాంపల్లె వడ్డెపల్లెలో దేవర ఎద్దు రెండువారాల క్రితం మృతి చెందింది. గురువారం కెమెరా రవికుమార్ ఆధ్వర్యంలో సాంప్రదాయబద్ధంగా పూజారులు దేవర ఎద్దు గుడిలో ఘనంగా పూజలు చేశారు. చుట్టుపక్కల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పోలీసు శాఖకు చిరస్మరణీయ సేవలు

కడప క్రైం, జూలై 31(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలం పాటు పోలీసు శాఖకు చిరస్మరణీయమైన సేవలందించి పదవీవిరమణ పొందడం అభినందనీయమని కడప డీఎస్పీ ఎ.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఈనెలాఖరున పదవీ విరమణ పొందిన పోలీసుసిబ్బంది ఎ.రవిశంకర్, బీఆర్ నరసింహులు, నాగశేషారెడ్డిలను సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కడప డీఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో అందించిన సేవలే ఉద్యోగానంతరం కూడా గుర్తుండిపోయేలా మంచి పేరు ప్రఖ్యాతులు తెస్తాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ టైటస్, డీపీవో ఏవో జ్యోతి, ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, ఈసీ మెంబరు ఎఫ్రిన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పదవీవిరమణ పొందిన సిబ్బందిని సన్మానిస్తున్న కడప డీఎస్పీ

కుందూలో నీరు.. వరి జోరు

● కూందూనదికి భారీగా ప్రవహిస్తున్న వరద నీరు ● పరివాహక ప్రాంతంలో ముమ్మరంగా వరినాట్లు ● ఆనందంలో అన్నదాతలు

రాజుపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కుందూనది పరివాహక ప్రాంతం వెంబడి పచ్చదనం పరుచుకుంటోంది. కుందూకు భారీగా వరదనీరు వచ్చిచేరడంతో వరినాట్లు ఊపందుకున్నాయి. కుందూలో గత నెల రోజుల క్రితం నారుమళ్లు పోసుకున్న రైతన్నలు కుందూకు భారీగా వరద నీరు రావడంతో నాట్లను వేసేందుకు సిద్ధమయ్యారు. గత నాలుగు రోజుల నుంచి వరి నాటతో రైతన్నలు బిజీబిజీగా ఉన్నారు. కుందూ తీర ప్రాంతంలోని కూలూరు, దద్దనాల, టంగుటూరు, తొండలదిన్నె, వెలివలి తదితర గ్రామాల్లో ఈ వరినాట్లు జోరుగా ఊపందుకున్నాయి. దాదాపు 200 ఎకరాల పైబడి వరి పంట సాగులోకి వచ్చే విధంగా ఈ వరినాట్లు రైతులు వేస్తున్నారు.



అదనంగా యూరియా అందించాలి

వరినాట్లు వేసుకున్న రైతన్నలకు గత వారంలో సచివాలయాలకు అరకొర యూరియా రావడంతో కొంత మేర ఉపయోగపడిందని, మరింత యూరియా అవసరంఅవుతుందని రైతులు తెలిపారు. త్వరగా రైతు సేవా కేంద్రాలకు యూరియా అందిస్తే సాగు చేసుకున రైతులకు కాస్త ఉపశమనం కలుగతుందని వారు తెలిపారు. సంబంధిత వ్యవసాయాధికారులు చర్యలు చేపట్టి కుందూ నది పరివాహక ప్రాంత రైతులకు సత్వరం యూరియా అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

58.95 టన్నుల యూరియా మంజూరు

పోరుమామిళ్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పోరుమామిళ్ల మండలానికి 58.95 టన్నుల యూరియా మంజూరైందని వ్యవసాయాధికారి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వెంకటనారాయణ ఫెర్టిలైజర్స్‌కు 18 టన్నులు, వీఎస్ ఫర్టిలైజర్స్‌కు 9టన్నులు, అమరావతి ఫర్టిలైజర్స్‌కు 4.5 టన్నులు, పవన్ ఆగ్రోస్ 5.85 టన్నులు, గోపిక్రిష్ణ ఫర్టిలైజర్స్‌కు 5.85 టన్నులు, విష్ణు ఫర్టిలైజర్స్‌కు 5.81 టన్నులు, మన గ్రోమోర్‌కు 9.9 టన్నులు యూరియా మంజూరైందన్నారు. యూరియా అవసరం ఉన్న రైతులు ఈ ఫర్టిలైజర్స్ లో పొందాలన్నారు. దమ్మనపల్లె రైతు సేవా కేంద్రానికి 9.9 టన్నుల యూరియా మంజూరైందన్నారు. గురువారం ఆయన పోరుమామిళ్లలోని ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను తనిఖీ చేశారు.

ఎంఈవోగా రమణయ్య



దువ్వూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండల విద్యాశాఖాధికారి-1గా కె.రమణయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పోరుమామిళ్ల నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇన్‌చార్జి విద్యాశాఖాధికారిగా పనిచేస్తున్న పద్మలత రమణయ్యకు బాధ్యతలు అప్పగించి ఆమె మైదుకూరుకు వెళ్లారు.

ఎంఈవో 1గా మహిమ్మద్ షఫీ

కాశినాయన జూలై31(ఆంధ్రజ్యోతి) మండల ఎంఈవో 1గా పి.మహమ్మద్ షఫీని ప్రభుత్వం నియమించింది. కడప అంధుల పాఠశాల హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మహమ్మద్ షఫీకి ఎంఈవో1గా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఆమేరకు గురువారం ఆయన నర్సాపురం ఎమ్మార్సీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

మంత్రి దుర్గేష్‌ని కలిసిన జనసేన నాయకులు



కొండాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను మండల జనసేన నాయకులు గురువారం గండికోటలో కలిశారు. మండల జనసేన కన్వీనర్ నరసింహాతో పాటు పలువురు నాయకులు మంత్రిని కలిసి సన్మా నించారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో జనసేనకు ప్రాధాన్యత కల్పిం చాలని మంత్రిని కోరినట్లు నరసింహా తెలిపారు.

జనసేన పార్టీ బలోపేతానికి కృషి

పోరుమామిళ్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి) :నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పోరుమామిళ్ల జనసేన నాయకుడు శీలంశెట్టి లక్షుమయ్య అన్నారు. గురువారం ఆయన నెల్లూరులోని ఆంధ్రప్రదేశ్ టిడ్కో చైర్మన్ జనసేన పార్టీ క్రమశిక్షణ కమిటీ వేములపాటి అజ య్‌కుమార్‌ను కలిశారు. బద్వేలులో ఆయన పర్యటన త్వరలో ఉంటుందన్నారు.

బంగారు నగలు అపహరణ

బద్వేలుటౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) ! పట్టణానికి చెందిన బీబీ అనే మహిళ ఓ బద్వేలు నుంచి నెల్లూరు వెళ్లేందుకు బస్సు ఎక్కిన తర్వాత తన పర్సును చూసుకోగా పర్సులోని 20 గ్రాముల బంగారు నగలు అపహరణకు గురైనట్లు గుర్తించింది. తక్షణమే ఆమె బస్సు దిగి స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దు

జమ్మలమడుగు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే ఉద్యమం తప్పదని సీపీఐ కార్యదర్శి ప్రసాద్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్లను ఎక్కడివక్కడ పగులకొడుతామని ఆయన హెచ్చరించారు.

ప్రజాసంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



సుపరిపాలనపై ప్రచారం చేస్తున్న సర్పంచ్ యనమల సుధాకర్

పోరుమామిళ్ల, జూలై 31 (ఆంధ్ర జ్యోతి): ప్రజాసంక్షేమమే కూటమి ప్రభుత్వలక్ష్యమని పోరమామిళ్ల మేజరు పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా సీఎం ఆదేశాల మేరకు బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువనేత రితీష్‌కుమార్‌రెడ్డి సూచనలతో ఈ ఏడాది అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించినట్లు తెలిపారు. గురువారం ఆయన ఇంటింటికీ తిరిగి టడీపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ శెట్టెం ప్రతాప్ పాల్గొన్నారు. అలాగే రంగసముద్రం పంచాయతీ పరిధిలో 78వ పోలింగ్‌బూత్ పరిధిలోని రహ్మత్‌నగర్‌కాలనీలో ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బండి ఓబులేసు టీడీపీ నాయకులు ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు.

కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి

అట్లూరు , జూలై 31 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతోందని మండల టీడీపీ అధ్యక్షుడు మల్లిఖార్జునరెడ్డి పేర్కొన్నారు. అట్లూరు మండలంలోని సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో గురువారం వరికుంట్ల గ్రామంలో కూటమి ప్రభుత్వం అమలుచేసిన పథకాలపై ఇంటింటికి వెళ్లి వివరించారు. కార్యక్రమంలో వరికుంట ,టీడీపీ నాయకురాలు శాంతకుమారి, బీఎల్‌వో వెంకటసుబ్బయ్య, మాజీ మండల అధ్యక్షులు మహేశ్‌బాబు, అల్ల వెంకటసుబ్బయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సోలార్‌ప్లాంట్ బలవంతపు భూసేకరణ ఆపాలి

జమ్మలమడుగు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పెద్దముడియం మండలం కొండకల్వటాలలో సోలార్ ప్లాంట్ బలవంతపు భూసేకరణ ఆపాలని రైతు సంఘం, సీఐటీయూ, డీవైఎఫ్ఐ, చేనేత కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వారు మాట్లాడుతూ కల్వటాల, గోవిందపల్లె గ్రామాల్లో సోలార్ యాజమాన్యం బలవంతపు భూసేకరణ చేస్తున్నారన్నారు. ఈ విషయమై వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలి

బద్వేలు రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్ అన్నారు. గురువారం స్థానిక పెన్షనర్స్ కార్యాలయంలో నిర్వహించిన ప్లీనరీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ డిగ్రీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటు కల్పించాలని, నియోజకవర్గస్థాయిలో ప్రభుత్వ డిగ్రీకళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్, వీరపోగు రవి, జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, అజయ్, మోహన్, సుమంత్, సుశాంత్, అరవింద్, చందు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు విద్యారంగ సమస్యలపై ధర్నా

బద్వేలు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్య పరిష్కారానికి ఆగస్టు 2వ తేదీన ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధన విజయ్‌కుమార్, హెచ్ఎంఏ జిల్లా అధ్యక్షుడు జి.వెంకటసుబ్బారెడ్డిలు పిలుపునిచ్చారు. గురువారం ఫ్యాప్టో బద్వేలు ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలను ఇచ్చిన కూటమి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక వారిని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు పెంచలయ్య, టి.శివప్రసాద్, సుధాకర్, సుబ్బరాయుడు, దేవానందం, కంచిరెడ్డి, చంద్రశేఖర్ యాదవ్, మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ

కలసపాడు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెల్లపాడు జడ్పీ హైస్కూల్‌లోని 1 నుంచి 5వ తరగతి, అంగన్వాడీ పిల్లలకు డాక్టర్ బాలకృష్ణారెడ్డి పలకలు, నోట్‌పుస్తకాలు, కంబాక్సులు అందజేసినట్లు ఎంఈఓ మస్తాన్‌వలి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. దాదాపు 70 మంది పిల్లలకు వాటిని అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగంపై అవగాహన

ప్రొద్దుటూరు టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రూరల్ పరిధిలోని గోపవరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగంపై అవగాహన కల్పించారు. గురువారం శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆద్వర్యంలో ప్లాస్టిక్ వ్యర్థాలతో వివిధ రకాల వస్తువులను తయారు చేసి చూపించారు. ఇటువంటి కార్యక్రమం ద్వారా విద్యార్థులకు సృజనాత్మకతను పెంపొందించడమేకాక పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కలుగుతుందని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఇందిర పేర్కొన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను వినియోగించడం వలన పర్యావరణ పరిశుభ్రతతోపాటు పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయురాలు సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సార్! నిర్వాసితులకు న్యాయం చేయండి

కొండాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు గారు! గండికోట నిర్వాసితులకు న్యాయం చేయాలని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు కోరారు స్థానిక ఏఐటీయూసీ కార్యాయలంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. కొన్ని లక్షల మందికి సాగు, తాగు నీరు అందించే గండికోట ప్రాజెక్టు నిర్వాసితులు సర్వం త్యాగం చేసి భూములు, ఇళ్లు కోల్పోయారని గత వైసీపీ ప్రభుత్వం నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా జీవో ఇచ్చి గాలికొదిలేసిందన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి వెంటనే పరిహారానికి సంబంధించిన నిధులు విడుదల చేయాలని కోరారు. అదేవిధంగా గండికోట పునరాసవాస కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు, శ్మశానవాటికలు తదితర మౌలికసదుపాయాలు అసంపూర్తిగా ఉన్నాయని, వెంటనే పూర్తిచేయాలన్నారు. సర్వం కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలు ఉపాధి లేక పలు ప్రాంతాలకు వలస వెళుతున్నారని, వారిని ఆదుకునే విధంగా స్థానికంగా ఒక పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి జమ్మలమడుగుకు వస్తున్న సందర్భంగా గండికోట నిర్వాసితుల సమస్యలు పరిష్కరించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు మనోహర్‌బాబు,వెంకటరమణ, సుబ్బారావు పాల్గొన్నారు.

మురుగునీటి కాలువతో అల్లాడుతున్నాం..



ఇళ్ల ముందు పాచికట్టిన మురుగునీరు

జమ్మలమడుగు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మేజర్ గ్రామ పంచా యతీ అయినమోరగుడి గ్రామం లో మురుగునీటి కాలువతో ఇబ్బం దులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. గ్రామంలో ఎక్కువ మంది చేనేత కార్మికులు నివాసం ఉన్నారు. జమ్మలమడుగు, మోరగుడి గ్రామాల మధ్య మూడు రోడ్ల కూడలి వద్ద నుంచి మోరగుడి శ్రీరాములపేట వరకు డ్రైనేజీ సమస్య ప్రజలకు శాపంగా మారిందని వాపో తున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కొన్ని సంవత్సరాలుగా నాయకులకు, అధికారులను కోరుతున్నా ఎవరు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఈ సమస్యకు సంబంధించి స్థానిక సర్పంచ్ కొండయ్యను 'ఆంధ్రజ్యోతి' సమస్యను తెలుపగా గ్రామ పంచాయతీలో నిధులు లేవని, 15వ ఆర్థిక సంఘం నిధులతో అందోళనబాట పట్టినా ఇంతవరకు డబ్బులు మంజూరు కాలేదన్నారు. మోరగుడి గ్రామంలో డ్రైనేజీ సమస్య రంగుసీళ్ల కాలువ వద్ద సమస్యలు ఉన్నాయన్నారు.

ఎమ్మెల్యే పుట్టాను కలిసిన ఎంపీపీ వీరనారాయణరెడ్డి



ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌ను సన్మానించిన ఎంపీపీ వీరనారాయణరెడ్డి కుటుంబ సభ్యులు

బ్రహ్మంగారిమఠం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు శాసనసభ్యుడు పుట్టా సుధాకర్ యాదవ్‌ను గురువారం ప్రొద్దుటూరులోని ఆయన నివాసంలో బ్రహ్మంగారిమఠం ఎంపీపీ వీరనారాయణరెడ్డి కలిశారు. సోమిరెడ్డిపల్లె సొసైటీ మాజీ సింగిల్ విండో చైర్మన్, మాజీ చైర్మన్ చిలేకాంపల్లె నాగేశ్వర్‌రెడ్డి, మల్లేపల్లె ఉప సర్పంచ్ చిలేకాంపల్లె కొండారెడ్డి, ఎంపీపీ కుమారులు చిలేకాంపల్లె సీతారామిరెడ్డి, చిలేకాంపల్లె తులసీశ్వర్‌రెడ్డి, గొడ్లవీడు ఉపేంద్రారెడ్డిలతో వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందించి శాలువాతో ఘనంగా ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా త్వరలోనే టీడీపీలోకి చేరుతున్నట్లు ఎంపీపీ వీరనారాయణరెడ్డి విలేకర్లకు తెలిపారు.

రైతులకు సకాలంలో యూరియా అందిస్తాం

మైదుకూరు రూరల్, జులై 31(ఆంధ్రజ్యోతి) :మైదుకూరు నియోజకవర్గంలోని రైతులు ఇబ్బందులు పడకుండా సకాలంలోనే యూరియాను అందిస్తామని గురువారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. ప్రొద్దుటూరులోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీ ఆయకట్టు కింద సాగు చేస్తున్న రైతులకు యూరియా ఎక్కువగా అవసరం ఉందని జిల్లా కలెక్టర్‌ను కోరడమైందని అందుకు ఆయన స్పందించి తగినంత యూరియాను అందిస్తామని తెలిపినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతులు తమ పాస్ బుక్కులను దగ్గరలోని రైతు సేవాకేంద్రాల ద్వారా పొందవచ్చని తెలిపారు.

ఎమ్మెల్యేని కలిసిన ఏపీ ఎన్జీవో నూతన కార్యవర్గం

ఇటీవల ఏపీ ఎన్జీవో తాలూకా నూతనంగా ఎన్నికైన కార్యవర్గం గురువారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌ని కలిశారు. ఈ సందర్భంగా ఎన్‌జీవో భవనానికి స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేని కోరారు. ఈ కార్యక్రమంలో తాలూకా అధ్యక్షుడు గజ్జల చంద్రమౌళి, కార్యదర్శి రఘువయ్య,ఉపాధ్యక్షులు రాజన్న,పెంచల్‌రెడ్డి,గురుప్రసాద్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

మైదుకూరు నియోజకవర్గంలో అనారోగ్యాలతో ఆసుపత్రుల పాలై డబ్బులు ఖర్చు చేసుకొని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న 9 మందికి సుమారు రూ.13 లక్షల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ గురువారం బాధితులకు అందజేశారు. కార్యక్ర మంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, రేనాడి వెంకటసుబ్బయ్య, బండి అమర్‌నాథ్, శ్యామేల్ పాల్గొన్నారు.

ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు స్టాపింగ్ పొడిగింపు

కొండాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ధర్మవరం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలు(17216 /17217) కొండాపురం రైల్వేస్టేషన్‌లో స్టాపింగ్‌ను ఆర్నెళ్లు పొడిగిస్తూ రైల్వేశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఆగస్టు 1 నుంచి ఆరునెలల పాటు ఈ రైలు స్టాపింగ్‌ను పొడిగిస్తున్నట్లు రైల్వేశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది. గత నెలరోజులుగా ఈ రైలుకు కొండాపురం రైల్వేస్టేషన్‌లో రిజర్వేషన్ సౌకర్యాన్ని నిలుపుదల చేశారు. తాజా ఉత్తర్వుల్లో ఆరునెలల పాటు రిజర్వేషన్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించారు. ఈ రైలును ప్రతి ఆరునెలలకు ఒకసారి కొండాపురంలో స్టాపింగ్‌ను పొడిగిస్తూ వస్తున్నారు. అలా కాకుండా కొండాపురం రైల్వేస్టేషన్‌కు పర్మినెంట్ స్టాపింగ్ ఇవ్వాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయండి

జమ్మలమడుగు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జమ్మలమడుగు, గూడెం చెరువుకు శుక్రవారం రానున్నందున నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఇప్పటికే జమ్మలమడుగు నియోజకవర్గంలో సుపరిపాలనలో తొలి పరిచయం అనే కార్యక్రమాన్ని ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందించి సమస్యలను అడుగడం జరిగిందన్నారు. పథకాలు అందుతున్నాయా? లేదా? సంక్షేమ పథకాలు అందాయా? అడిగినట్లు తెలిపారు. జమ్మలమడుగులోని నానుబాల యల్లప్ప ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నియోజకవర్గంలోని క్లస్టర్, యూనిట్, బూతు ఇన్‌చార్జిలు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం అవుతారని అందరు సభ్యత్వం ఐడీ కార్డు మెడలో వేసుకుని వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

చెరువుకు పూర్తిస్థాయిలో నీరు నింపలేం

ఖాజీపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రావులపల్లె చెరువుకు పూర్తిస్థాయిలో నీరు నింపలేమని కేసీకెనాల్ ఏఈ సుబ్బరాయుడు పేర్కొన్నారు. గురువారం రావులపల్లె సర్పంచ్ దుగ్గిరెడ్డి లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో రైతులతో కలిసి చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ పైపులైను వేయడంతో చెరువు కట్ట తొలగించారని పలుమార్లు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని పూర్తిస్థాయిలో నీరు నింపాలంటే కట్ట నిర్మాణం పూర్తి చేయాలని లేదంటే 60 శాతం మాత్రమే నీటిని నింపగలమన్నారు. చెరువు కింద దాదాపు 200 ఎకరాల్లో వరి పంట సాగు చేస్తారని కట్ట నిర్మాణం పూర్తి చేయకుంటే వారికి కొద్దిమేర మాత్రమే నీరు అందించగలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారుగా వెంకటేశ్వర్లు సేవలు మరువలేనివి



పదవీ విరమణ చేసిన తహసీల్దారు వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న దృశ్యం

రాజుపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాజుపాలెం తహసీల్దారుగా ఎం.వెంకటేశ్వర్లు అందించిన సేవలు మరువలేనివని వక్తలు పేర్కొన్నారు. గురువారం తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు పదవీ విరమణ సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు ఆర్డీవో ఆఫీసు ఏవో ఇక్బాల్, మైదుకూరు తహసీల్దారు రాజనరసింహనరేంద్ర, కాశినాయన తహసీల్దారు వెంకటసుబ్బయ్య తదితరులు ఆయన సేవలను కొనియాడారు. అనంతరం వెంకటేశ్వర్లు దంపతులను డీటీ మనోహర్‌రెడ్డి, ఆర్ఐ హుసేన్‌రెడ్డి, వీఆర్వోలు అశోక్‌కుమార్ తదితరులు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నారు.